

సరస్వతీ మగ పురుగులా

సరస్వతికి మగపురుగులంటే ద్వేషం ఎలా ఏర్పడిందో ఎవరికీ తెలీదు. అసలావిడలా మగజాతిమీద మండి పోతున్నదన్న సంగతే చాలా కాలం వరకూ చాలామందికి తెలీదు. వాళ్ళ సొంతూరు టెంకాయపాలెంలో ఫోర్త్ ఫారం రెండోసారి చదువుతున్నప్పుడు హైస్కూల్లో ఓసారి "స్త్రీ గొప్పదా, పురుషుడు గొప్పాడా?" అన్న అంశం మీద చర్చ జరిగింది. అందులో సరస్వతి కాగితం చూడకుండా, ఏకధాటిగా, నలభై నిమషాల స్పీచ్‌లోనూ ముప్పైతొమ్మిది నిమిషాలు మగజాతిని దుమ్మెత్తిపోసింది. అప్పుడే ఈ విషయం అందరికీ తెలుస్త. ఆవిడ వాగ్ధాటికి ఆహుతయిన కుర్రాళ్ళల్లో కొంతమంది వెంటనే అర్జంటుగా ఓ కమిటీవేసి ఆవిడలా మగజాతిమీద మండిపోడానికి కారణాలు వెతికించసాగారు. ఆ కమిటీ ఎనిమిది గంటలపాటు దర్యాప్తు జరిపి దీనికంతకూ కారణం కిష్టిగాడనే ఫిఫ్త్ ఫారం కుర్రాడని తేల్చారు. సదరు కిష్టిగాడు ఓ పెద్దముహూర్తాన సరస్వతిని పంటకాలువ గట్టుమీద చూచి ప్రేమించినంత పన్జేశాడు. వెంటనే సరస్వతి పేరిట ఓ ప్రేమలేఖరాసి స్వయంగా చేతికందించాడు.

"నిన్ను లవ్‌చేశానూ, నీకూ ఇష్టం అయితే మారేజ్ చేసుకుంటానని ఉందందులో. సరస్వతి తనకిష్టవయిందీ లేనిదీ చెప్పలేదు. కనీసం జవాబుగూడా రాసివ్వలేదు. ఆ ఉత్తరం పట్టుకెళ్ళి

హెడ్మాస్టరు చేతిలో పెట్టింది కాశికావ తారం ఫోజులో. హెడ్మాస్టారా ఉత్తరం చదివి, ఆ పిల్ల తనను లవ్ చేసినందుకు సంబరపడి నిన్ను పెళ్లాడ్డం నా కిష్టవే గాని మా ఆవిడ ఊరుకోదే ... ఎలా గబ్బా..." అంటూ ఆలోచనలో పడి పోయాడు.

సరస్వతి మరింత అగ్గయిపోయి "సర్! ఆ ఉత్తరం నేను మీకు రాసింది కాదు," అంది.

"మ రెవ్రరాశారు?" అంటూ ఆశ్చ ర్యంగా అడిగాడాయన.

"కిష్టిగాడు. ఫిఫ్త్ఫారం చదువు తున్నాడు..." అంది సరస్వతి.

"వాడు నన్ను లవ్ చేయడమేమి టబ్బా...మగాళ్ళు మగాళ్లని ఎక్కడన్నా లవ్ చేసుకుంటారా" అని మళ్ళీ ఆలో చనలో పడేటంతలో సరస్వతి మండి పడిపోతూ, "అతగాడు ఆ ఉత్తరం రాసింది మీక్కాదు. నాకు ... వాడికి చచ్చేంత పనిష్మెంట్ ఇవ్వండి..." అంది కసిగా.

"ఏమిటీ? నా స్కూల్లోనే ఇంత ధైర్యం చేశాడా? ఇదేమన్నా స్కూలను కొన్నాడా, 'మ్యారేజ్ బ్యూరో' అను కున్నాడా—అసలిలాంటి బుద్ధులేమిటి వాడికి విద్యార్థినులను చెల్లెళ్ళలాగా అక్కలాగా చూడాలికాని ... ఇప్పుడే చెప్తాను వాడిపని..." అంటూ వెంటనే కిష్టిగాడిని తన రూమ్లోకి పిలిపించాడు.

అక్కడ సరస్వతిని చూడగానే కథంతా తెలుగు సినిమాలాగా మొదట్లోనే తెలిసి పోయింది. అంచేత హెడ్మాష్టర్ తన నేమీ అడక్కుండానే అన్నీ చెప్పేశాడు.

"నేను ఈ అమ్మాయికి వుత్తరం రాసినమాట నిజమే! ఆమె కిష్టమయితే పెద్దాళ్ళద్వారానే మాట్లాడించి చేసు కొందా మనుకొన్నాను. ఇంతకంటె వేరే అభిప్రాయం నా కేమీ లేదు..."

"నోర్ముయ్. నో ర్ము య్ ... " అన్నాడు హెడ్మాష్టరు ఇంకేమనాలో తెలీక

"నా స్కూల్లో ఆడపిల్లలకు ఉత్త రాలు రాయడానికి ఎంత ధైర్యం?" అన్నాడు వెంటనే.

"స్కూల్లో రాయలేదండీ!..."

"మరి?"

"ఇంట్లో రాశాను కాలవగట్టుమీద అందించాను...స్కూల్ కేమీ సంబంధం లేదు..."

"నోర్ముయ్ ... నోర్ముయ్ ... " అన్నాడాయన మళ్ళీ.

నోర్మూసుకుని ఊరుకుండిపోయాడు కిష్టిగాడు.

" నిన్ను డిబార్ చేస్తాను ... " అన్నాడు హెడ్మాష్టరు.

"నిన్ను బయటిగ్గెంటిస్తాను ... " అన్నాడు మళ్ళీ కాసేపాగి.

"నీ చర్మం వలిపించేస్తాను ... నీ కాండక్ట్ వెరీ డర్టీ అని రాసి పారే స్తాను..."

అన్నీ విని "నీఇష్టమొచ్చినట్లుచేసుకో ఫో..." అనేసి బయటికివెళ్ళిపోయాడు. హెడ్మాష్టరుకి వళ్ళుమండిపోయి వాడిని డిబార్ చేసిపారేశాడు. తరువాత ఇంకా వళ్ళుమండితే టి సీ కూడా ఇచ్చి బయటికి నెట్టిపారేస్తానన్నాడు.

దీనికంతకూ కారణమయిన సర స్వతిమీద కోపం వచ్చేసింది కిష్టిగాడికి. వెంటనే ఓ మంచిరోజుచూసి, ఆ పిల్ల వంటరిగా కాలవగట్టు వెంబడి ఇంటి కెళ్తొంటే, వాటేసుకొని గట్టిగా ముద్దు పెట్టుకున్నాడు. సరస్వతి కసలు ఇలాంటి చేష్టలంటే వళ్లుమంట. కాని ఆ క్షణాన అందులో ఏదో హాయి కని పించింది.

''ఛీ! వదులు...'' అంది సిగ్గుతో.

''నీ ముఖానికి సిగ్గుకూడానా! ఛీ!- అసలు నిన్ను ముట్టుకోడంకూడా అస హ్యమే. .'' అని రెండు చెంపలూ చెళ్ళుమని మోగించాడు. సరస్వతి కళ్ల వెంబడి నీళ్ళు జలజలా రాలిపోయినయి.

''అమ్మా!'' అంటూ రెండు చెంపలూ బాధగా తడుముకొంది.

''మర్యాదగా ప్రవర్తిస్తే రిపోర్టిస్తావా? ఇప్పుడు నీ దిక్కున్నచోట చెప్పుకో- నిన్ను ముద్దెట్టుకొన్నానని" అనేసి అక్కడి నుంచి వెళ్లిపోయాడు.

ఆ క్షణాన్నుంచి సరస్వతికి మగ పురుగులమీద ద్వేషం మొదలయింది.

ఓసారి పక్కింటి అమ్మాయిమొగుడు చనిపోతే ఆ అమ్మాయి గాజులు తీసే యటం, తెల్లచీరలు కట్టుకోడం చూసింది. మరోసారి ఆపేటలో వుంటున్న సుబ్బా రావు పెళ్ళాం చచ్చిపోతే సంవత్సరం తిరక్కముందే ఝామ్మని మళ్లీపెళ్లిచేసు కోవడం చూసింది. మరింకోసారి ఓ అను మానపు మొగుడు పెళ్ళాన్ని మరో మగా డితో మాట్లాడినందుకు ఆమెని ఉతికే యడం కళ్ళబడింది.

తరువాత కొన్ని రోజులకి ఆడా ళ్ళందరూ ఏదోరకంగా మగాడిచేతుల్లో నానాహింసలూ పడుతున్నట్లు అనిపించ సాగింది.

ఇవీ-మరికొన్ని ఇలాంటి సుందర దృశ్యాలూ ఆమె ద్వేషాన్ని ఒకటికి పాతికింతలు పెంచేసినాయి.

''ఈ మగరాస్కెల్స్‌కి ఏమిటంత మిడిసిపాటు? వీళ్ళకి ఆడదెందుకు లొంగి వుండాలి? వంటింటి కుందేలుగా మగా డెందుకు వుండకూడదు? చీరలు ఆడదే ఎందుకు కట్టుకోవాలి? మగాడెందుకు కట్టుకోడు? మగాడినిచూస్తే ఆడదెందుకు సిగ్గుపడాలి? ఎందుకు భయపడాలి? ఆడది స్వతంత్రంగా, మగాడిమీద ఆధారపడకుండా ఎందుకు బతకలేదు? మగాడు చేసేపనులన్నీ స్త్రీకూడా చేయ గలదు కదా?'' అని మండిపడింది.

"వీళ్ళ అంతేమిటో చూస్తాను. నా తోనే ఈ ఆంధ్రదేశంలో రివల్యూషన్ మొదలు'' అని డయిరీలో రాసుకొంది.

ఆ మర్నాడే కొంతమంది స్నేహితురాం డ్రను పోగుచేసి 'వీరనారీ నికేతన్' ప్రారంభించింది. ఇందులో చేరదల్చు కొన్నవారు కొన్ని నిబంధనలకు కట్టు బడి ఉంటామని హామీ రాసివ్వాలి.

ఆ నిబంధనలు ఇలా ఉంటాయి:

నన్ను చేసుకొనేవాడికి కట్నం ఇవ్వను. పెళ్ళంటూ చేసుకొంటే నేనేం చెప్పినా నోర్మూసుకుని ఆపనిచేసే మగా డినే చేసుకొంటాను. నేను ఉద్యోగం చేస్తాను. నా భర్త వంటచేస్తాడు. నేను ఇంటిబాధ్యత, నాభర్త వంటింటిబాధ్యత తీసుకొంటాము. పిల్లల్ని కనడంవరకే నావంతు. పెంచి పెద్దచేయడం మొగుడి పని వగైరా వగైరాలు...

వీటిని చదివిన ఆమె స్నేహితురాం డ్రంతా "అబ్బో! అబ్బో! ఎంత బాగు న్నయ్యో..." అని తెగ ముచ్చటపడి వెంటనే 'వీరనారీనికేతన్ జిందాబాద్' అని పాతికసార్లు అరచి అందులో సభ్యు లుగా చేరిపోయారు. ఈ సంగతంతా విన్న సరస్వతిఫాదరు అర్జంటుగా అమ్మాయికి సంబంధాలు చూడటం మొదలుపెట్టాడు.

ఈ సంగద్దెల్సిన సరస్వతి తండ్రి దగ్గరకెళ్లి తను తయార్జేసిన నియమా వళి లిస్టుతాలూకు కాపీ ఒకటి ఆయన కిచ్చి "వీటిని అంగీకరించేవాడెవడయినా వుంటే ఇదిగో ఈ స్టాంపున్నచోట సంతకం పెట్టించి తీసుకురా-అప్పుడు ఇంటర్వ్యూ తీసుకొంటాను..." అంది.

ఆ నియమావళిని కళ్ళజోడు పెట్టు కుని ఆరుగంటలపాటు చదివి వెంటనే కారుతీసుకొచ్చి అమ్మాయినెక్కించుకొని మెంటల్ హాస్పటల్‌కి తీసుకెళ్లి డాక్టరుకి చూపించాడు.

"ఏమిటి జబ్బు? ఏం పిచ్చిపనులు చేస్తోంది?" అనడిగాడు డాక్టరు.

"ఇదిగో...ఇది అమ్మాయే రాసింది అన్నాడు తండ్రి నియమావళి లిస్టు ఆయన చేతికందిస్తూ.

"అది చదివిన డాక్టరు కొంచెంగా నవ్వి, "ఇది చాలా ప్రారంభదశలోనే వుంది. ఇంకా బాగా ముదిరాక తీసుకు రండి — ఎంచేతంటే ఒకోసారి ఇలాంటి కేసులు సడన్‌గా నయమయిపోవచ్చు-" అని చెప్పారు.

ఇక లాభంలేదని తండ్రి సరస్వతి సంగతి పట్టించుకోడం మానేశాడు. దాంతో 'వీరనారీనికేతన్' సంస్థ ఎదిగి పోయింది పెళ్ళికాని అమ్మాయిలు చాలా మంది అందులో చేరిపోయారు. మగాళ్ళ తోడులేకుండా అన్ని రంగాల్లోనూ స్త్రీలే ప్రతిభావంతంగా పనిజేయగలరన్న విష యాన్ని రుజూచేయాలని అందరూ ఏక వుమ్మడిగా తీర్మానించేసుకున్నారు.అంతే కాకుండా ప్రజల్లోకివెళ్లి అజ్ఞానాంధకా రంలో పడి తమ వునికిని, ప్రతిభను మరచేపోయి వంటిళ్ళల్లో మగ్గి, మసి

కొట్టుకుపోతున్న ఆడజాతిని వుద్ధరించా లని తలోకంకణం కొని కట్టుకొన్నారు (రాగివి).

"వీరనారి నికేతన్" ప్రథమ సాంస్కృతికోత్సవం అద్భుతంగా జరిగింది. చాలామంది ఆడవాళ్ళు గొంతుపగిలేట్లు మైకులో 'మగాడి నిరంకుశత్వం' మీద లెక్చర్లిచ్చారు. 'మగాడు నశించాలి'అన్న కేకలతో ఆనాటి సభ ముగిసింది. రాత్రికి సరస్వతి స్వయంగా రచించిన మగపాత్రలులేని "మగరాక్షసులు - స్త్రీ భక్షకులు" అద్భుతంగా ప్రదర్శించారు.

ఆ డ్రామాకి లైటింగ్, కర్టెన్ ఎరేంజ్ మెంట్, మైక్‌సిస్టమ్, ప్రాంప్టింగ్,మేకప్ ఆర్కెస్ట్రా, ప్లేబాక్, స్టంట్స్, డాన్స్ డైరెక్షన్, అసలు డైరెక్షన్, అన్నీ ఆడాళ్ళే చేపట్టటం ఓ ప్రత్యేకత. ప్రవేశం కేవలం ఆడవారికి మాత్రమే అని వుండటంచేత కేవలం ఆడవారేఆ డ్రామా చూశారు. చూసింతర్వాత "నిజంగా చాలా గొప్పాళ్ళం" అని సంబరపడిపోయారు. మర్నాటినుంచీ మొగుడిపని పట్టాలని అనధికారంగా నిర్ణయం తీసుకొన్నారు.

ఆ తరువాత 'ఆడది అబలకాదు. సబలేనని తెలుసుకోండి' డ్రైవ్ మొదలయింది. అందరూ పాదయాత్ర మొదలుపెట్టి ఊరిబయటున్న కూలీవాళ్ల గూడానికి వెళ్ళారు.

అక్కడ ఎవ్వరూ కనిపించలేదు. ఇద్దరు ముసలమ్మలు, బోలెడుమంది చిన్నపిల్లలు గుడిసెల మధ్య చెట్లకింద కూర్చుని కనిపించారు.

"ఆడాళ్ళంతా ఏరీ?" అనడిగింది సరస్వతి వాళ్ళను.

"ఎందుకమ్మా?" అనడిగారు ముసలమ్మలు, అనుమానంగా చూస్తూ. ఎంచేతంటే అప్పుడప్పుడూ కార్లమీద ఇలాగే బోలెడుమంది ఆడాళ్ళువచ్చి "మీరిలా మురికిగా వుండకూడదు. వుంటే జబ్బులొస్తయి. శుభ్రంగా ఉండండి. తెల్లని బట్టలు కట్టుకోండి, విటమిన్లున్న తిండి తినండి. పాలు ఎక్కువగా తాగండి." అని చెప్పి వెళ్ళిపోతూంటారు. వీళ్ళుకూడా ఆ బాపతేనేమో అని అనుకొన్నారప్పుడు కూడా-

"మేము ఆడాళ్ళ నుద్ధరించటానికి వచ్చాం. యుగయుగాలనుంచీ మగాళ్ళు మనని అణగదొక్కేశారు. వంట చేయడానికీ, పిల్లలు కనడానికీ తప్ప మరి దేనికీ పనికిరాదన్న అబద్ధాన్ని సృష్టించి మనని కలకాలం వాళ్ళమీద ఆధారపడేట్లు చేశారు. కాని మనం ఇప్పుడు మేల్కొన్నాం. ఇకనుంచీ మనం కూడా వాళ్ళతో సమానంగా పని చేస్తాం. ఇంటి పని మగాళ్ళతో చేయిస్తాం," అంది సరస్వతి ఉద్రేకంగా. ముసలమ్మలిద్దరూ ఆశ్చర్యంగా చూశారు వాళ్ళవంక.

"మీరేం చెప్తున్నారో అర్థం కావడం లేదమ్మా! మా కూలోళ్ళల్లో మాకా ఆడా

మగా భేదం లేదు. అందరం కలిసి కష్ట పడతాము. కలిసే కూలీ చేస్తాము. కలిసే అన్ని పనులూ చేసుకొంటాము. ఇంక ఇప్పుడు మేల్కొనడం ఏమిటి ?" అనడిగారు.

సరస్వతి బృందానికి ఏం చెప్పాలో అర్థం కాలేదు. వాళ్ళందరూ ఆశ్చర్యంలో మునిగిపోయారు.

కూలీజనస్త్రీలు ఇంత ఎడ్వాన్సయి పోయారని వాళ్ళనుకోలేదు.

"జై కూలీజన స్త్రీలూ-జిందాబాద్" అని అరిచారు పావుగంట సేపు.

ఆ అరుపులకి పసిపిల్లలంతా భయ పడి కెవ్వున ఏడుపు లంకించుకొన్నారు.

"ఓరి-మీరంతా ఎలక్షనోళ్ళా-వాళ్ళ యితేనే ఇలా అరుస్తారు మీకే ఓట్లేస్తాం గాని ఇక పొండి - పిల్లలు దడుసు కొంటున్నారు..." అన్నారు కోపంగా.

అందరూ అక్కడినుంచి కదిలారు.

దోవలో రోడ్డుపక్కనే ఉన్న చెట్టు కింద గుడిశెముందు ఓ రిక్షా ఆగి ఉంది. అందులో ఓ గిరజాల జుట్టోడు పడుకొని బీడీ కాల్చుకొంటున్నాడు. పక్కనే రాళ్ళపొయ్యిమీద అన్నం వండుతోంది వాడి పెళ్ళాం.

"ఎంతసేపే సియమ్మ - తొరగా వొండు..." అన్నాడు వాడు పెళ్ళాన్ని బూతులు తిడుతూ.

ఇది చూడగానే సరస్వతి బృందానికి కడుపు రగిలిపోయింది.

అందరూ వాళ్ళ చుట్టూ మూగి పోయారు.

"ఏయ్ అమ్మీ! ఎందుకలా చూస్తా ఊరుకొంటావ్,.నీ మొగుడలా తిడుతూ ఉంటే — ఇంక ఈ మొగాళ్ళ దౌర్జన్యం ఎదుర్కోవాలి. మే మందరం నీకు సహాయం చేస్తాము. ఇకనుంచీ వంట నీ మొగుడిని కూడా వండమను-ఆడాళ్ళూ మగాళ్ళూ అంతా సమానమే-మన మేం తక్కువ తిందిలేదు. తెల్సిందా! మగాడేం దేముడు కాదు, పూజించ టానికి —ఏమయ్యా-నీకు సిగ్గులేదూ, ఆడదాన్నలా తిడతానికి ?"

"ఇక మీ ఆటలుసాగవ్-ఆడాళ్ళు మీ మగాళ్ళ మీద ఆధారపడరిక తెల్సిందా ?"

"పిల్లల్ని పెంచటం, వంట చేయడం- మగాళ్ళు చేయాలి..."

రిక్షావాడు బీడీ చేతిలోకి తీసుకొని లేచినుంచున్నాడు.

"ఎట్టెట్టా! అయితే మగోడు కూడా ఇంటిపని సేయాలన్నమాట..."

"అవును—ఆడది మగాడి బానిస కాదు-ఇద్దరూ సమానమే-" అంతా ముక్త కంఠంతో అరచారు

అహ్హాహ్హాహ్హా...పగలబడి నవ్వాడు వాడు.

"ఏయ్-ఎందుకలా నవ్వుతావు ?"

"సియమ్మ - మీరు పిచ్చోళ్ళా - మంచోళ్ళా-అని..."

"ఏం!"

"లేపోతే ఏందెహ! సరే మీరు సెప్పి నట్టు నేను వొంట సేత్తాను. పిల్లగాడిని సాకుతాను—మరి రిచ్చా ఎవర్తొక్కు తారు ?"

"రిక్షాతొక్కి వచ్చి ఈ పనులన్నీ చేయాలి..." అరిచారు వాళ్ళు.

"సరే—సేత్తాను-ఆడా మగా అంతా సమానమని మీ రే అన్నారుగా-ఇయాల్టి నుంచీ మా ఆడది కూడా రిక్షా తొక్కా లన్నమాటేగా ?..."

కొద్దిసేపు సరస్వతి బృందానికి నోట మాట రాలేదు.

"అవును ! తొక్కాలి-ఆడది రిక్షా కూడా తొక్కగలదు..." అన్నారు నీరసంగా.

ఈ మాట వినడంతోనే రిక్షావాడి పెళ్ళాం తారాజువ్వలా వాళ్ళమీదకు దూసుకొచ్చింది.

"ఏటీ ? ఆడది రిచ్చా తొక్కాలా ? సాల్నాల్లే ఎల్లండి. కావాలంటే మీ ర్తొక్కు కోండి రిచ్చా! నా కోపిక లేదు. ఆడు కట్ట పడగలడు. ఆడికి ఒలముంది. అందు కని ఆడే రిచ్చా తొక్కుతాడు. నేనాడికి అన్నం వొండి పెడతాను. ఆడి కాళ్ళు నొప్పులేడితే తెల్లార్లూ పడతాను. మద్దెలో మీకేటి సింత ? సిగ్గు నేకుండా సాటాడ దాన్ని రిచ్చా తొక్కమని సెప్తున్నారా?"

"రొండు గజాల్తొక్కితే రొణ్ణెల్లు పడు కోవాల మల్లా—"

మరిక కూతలు వినలేకపోయారు.

వాళ్ళు. వెనక్కు తిరిగి వేగంగా నడిచారు.

"ఇదిగో సూడు బుల్లెమ్మ! ఈ సావంతా మీకే! ఈడ మాకా తేడాల్లేవు. మగాడు కండ కరిగిత్తాడు. ఆడది ఆణ్ణి సుకపెడద్ది - అంతే...అహహహ..." అందరి ముఖాలూ అవమానంతో కంది పోయినయి వాడి గొంతు విని. కొద్ది దూరం నిశ్శబ్దంగా నడిచాక సావిత్రి అంది.

"వాడు చెప్పిందీ నిజమేనే! నిజంగా రిక్షా తొక్కటం ఆడదాని వల్లేమవు తుంది? అంచేత మనం ఈ 'రూల్' వీదాళ్ళ పట్ల వర్తింపజేయకూడదు... పైగా వీళ్ళు 'సమానత్వం' ఎప్పుడో సాధించేశారు. కానీ మనం ఇక్కడో ట్రిక్ చేయాలి. ఈ కూలీజనంలోని ఆడదాన్ని మనమే సంస్కరించామని, అందరి తోనూ చెప్పుకొందాం...ఏం?"

"అవును..." అన్నారు అందరూ.

అందరూ కాలనీల్లోకి వచ్చేశారు.

"చూడండి! మనం ఉద్యమం ప్రారంభించింది ముఖ్యంగా మధ్య తరగతి కుటుంబాల్లోని స్త్రీల కోసం— ఈ కుటుంబాల్లోనే స్త్రీ అనాదిగా బానిస బ్రతుకు బ్రతుకుతోంది. ఇక్కడే మనం విజయం సాధించాలి! వీళ్ళను ఈ బంధాల నుండి విముక్తి చేయాలి..." అంది సరస్వతి.

అంతా బిలబిలమంటూ ఓ ఇంట్లోకి నడిచారు. లోపల ఇంటావిడ దర్జాగా మంచం మీద కాలుమీద కాలేసుకొని పడుకుని వారపత్రికలో 'సీరియల్' చదువుతోంది.

అందరూ ఇంట్లోకి రావడం చూచి లేచినుంచుంది.

"వీరనారీనికేతన్ జిందాబాద్" అంటూ అరచారు వాళ్ళు.

ఆవిడ దబ్బున ఇంట్లోకెళ్ళి ఓ పావలా కాసు తీసుకొచ్చి వాళ్ళకివ్వ బోయింది.

"ఏమిటి? పావలా ఎందుకూ?" ఆశ్చర్యంగా అడిగింది సరస్వతి.

"నాదగ్గ రింకేమీలేదు - ఇష్టమయితే తీసుకోండి-లేకపోతేలేదు..." అంది.

"మేం డబ్బుంకోసం రాలేదు..."

"మరి?...

"వీరనారీనికేతన్" తరపున వచ్చాం! మన ఆడాళ్ళను ఈ బానిస బ్రతుకు నుంచి విముక్తి చేయాలని మా సంకల్పం. యుగయుగాల నుంచీ పురుషుడు తెలివిగా ఆడదాన్ని అణగ దొక్కుతూనే ఉన్నాడు. ఇంక మనం ఇది సహించకూడదు. ఆడది కూడా మగాడితో సమానమని ఋజూ చేయాలి- మగాడితో ఆడది చేసే పనులన్నీ చేయించాలి. ఆడది మగాడిమీద ఆధార పడకూడదు. వాడిని లెఖ్ఖచెయ్యకూడదు. తనూ ఉద్యోగం చేయగలదు-కుటుం బాన్ని పోషించనూ గలదు-తన కాళ్ళ

మీద తను చాలా తేలికగా నిలబడ గలదు. ఇదే మనం ఆచరించి చూపిం చాలి. మగాడి నిరంకుశత్వాన్ని అణచి వేయాలి..."

"ఇప్పుడేం చేయమంటారు ?" సీరి యల్ మధ్యలో ఆగిపోయిందే అన్న బాధతో అంది ఆ ఇంటావిడ.

"మరేమీలేదు. ఇవాళ్ల నుంచీ ఇంటి పనులన్నీ మీ ఆయనతో చేయించండి. పిల్లల్ని పోషించడం మిగతా విషయాలని కూడా ఆయన్నే చెయ్యమనండి. మీరు చదువుకున్న వారు కాబట్టి మీరు ఉద్యోగం సంపాదించండి."

"ఆయన్ని మాన్పించి ఇంటిపని ఆయన కప్పజెప్పండి..."

"కొంచెం మీ మోత ఆపుతారా ?" అడిగిందావిడ అడ్డుపడి.

"ఏమిటి ?"

"అదిగో-ఆ ఫైళ్ళ మధ్య కదుల్తున్న ఆకారం చూసారా ?"

అందరూ అటు చూశారు. అంత వరకూ అక్కడ అన్నీ ఫైల్సే ఉన్న యనుకొన్నారుగాని వాటిమధ్య ఒకాయన కూర్చుని రాసుకొంటున్నాడు.

"ఆ ఫైళ్ళు రాస్తోంది మా ఆయన. పగలంతా ఆఫీసులో పని చేసిచేసి మళ్ళీ ఇంటికొచ్చి కూడా రాస్తూంటారు. అయినా తరిగిచావదు ఆ పని. ఇంట్లో నేన్జేసే పనేమిటనుకొన్నారు. పొద్దున్నొక గంట-సాయింత్రం మొకగంట వంట చేస్తాను. అంతే. మిగతా టైమంతా నా పనికే సరిపోతుంది. స్నానం చేయటం-మేకప్ అవటం-మధ్యాన్నమంతా చక్కగా పడుక్కొని సీరియల్స్ చదువు కోటం-సాయింత్రం ఏ పక్కింటి కామా క్షమ్మగారితోనో మార్కెట్ కెళ్ళి కాయ గూరలు తెచ్చుకోవడం-లేదా ఒక్కర్తెనూ సినిమాకి వెళ్ళిపోడం-ఇంత సుఖమైన బ్రతుకొదిలి-నన్నూ ఆ ముదనష్టపు ఉద్యోగం చెయ్యమంటారా? ఆడాళ్ళనుద్ధ రించటం అంటే ఇలా ఊబిలోకి దించట మేనా ? నా వల్లకాదు గానీ వెళ్ళండి-కావాలంటే మీరు చేసుకోండి ఆ వెధ వుద్యోగాలు-మూడొందల్రూపాయలకాళ పడి ఆఫీసులో అడ్డమైన వాడినీ 'సార్' అనటం నావల్ల కాదు. ఆ పాట్లేవో మా ఆయనే పడతాడు. నేను దర్జాగా ఇంట్లో ఉంటాను. నాకా నరకం వద్దు...

అందరూ బయటికొచ్చారు.

"వీళ్ళనుద్ధరించటం కొంచెం కష్టమే! టోలెడు ఓపికుండాలి మనకు..." అంది సరస్వతి చెమటలు తుడుచు కొంటూ.

అంతా మరో ఇంట్లోకి నడిచారు.

అక్కడ ఇంటాయనా, ఇంటావిడా ఇద్దరూ గార్డెన్‌లో కుర్చీల్లో కూర్చుని ఉన్నారు. ఆయన దర్జాగా పేపరు చదువుకొంటున్నాడు.

"రండి! ఇద్దరం ఇప్పుడే ఆఫీస్

నుంచివచ్చాము" అందావిడ ఆహ్వానిస్తూ. ఇంట్లోంచి పొగవస్తోంది.

"గాస్ అయిపోయింది. కిర్సనాయిలు దొరకటం లేదు. కట్టెల పొయ్యితో చచ్చి పోతున్నాననుకోండి. ఒకటే పొగ..." తిరిగి అందావిడ.

"అదే - మే మొచ్చిందందుకే- ఉద్యోగం ఇద్దరూ చేస్తారు. కానీ ఆఫీసు నుంచి ఇంటి కొచ్చేప్పటికి పెళ్ళామే ఎందుకు వంటచేయాలి ? మగాడెందుకు చేయకూడదు ? ఆడదంటే ఎందుకంత హీనభావం ? 'వంట' అనేది ఆడదే చేయాలని ఎక్కడేనా రాసుందా ? ఇలాంటి దురలవాట్లు పోగొట్టి ఆడవారిని ఆదుకొంటానికే మేము 'వీరనారీనికేతన్' స్థాపించాము..." చెప్పుకుపోతోంది సరస్వతి.

"కొంచెం నే నొచ్చేప్పేది వింటారా ?" అడ్డుపడింది ఇంటావిడ.

"ఏమిటది ?"

"ఆఫీసునుంచి వచ్చి ఇంట్లో ఆడదే వంటచేస్తుందని మీ కెవరు చెప్పారు ?"

సరస్వతి ఉక్కిరిబిక్కిరయింది.

"అంటే...ఇప్పుడు మీరు వంట చేయటం లేదా ?"

"ఏడ్చినట్లుంది. అసలు నాకు వచ్చే డిస్తే కదా-చేయటానికి. అయినా మా ఆఫీసులోని ఆడాళ్ళల్లో ఎవ్వరూ వంటలు చెయ్యరు. అందరికీ వంట మను షులున్నారు. అంచేత ఎవ్వరికీ వంట బాధలేదు..."

మరింకేం చెప్పాలో తెలీలేదు సరస్వతికి. .

అందరూ వెనక్కి తిరిగి మరో ఇంటికి చేరుకొన్నారు.

ఆ ఇంటి తలుపులు మూసేసి ఉన్నాయి. లోపల్నుంచీ స్త్రీపురుషుల గొంతులు గట్టిగా వినబడుతున్నాయి. ఉండుండి గట్టిగా కొడుతున్న చప్పుడూ-ఏడుపూ అస్పష్టంగా వినిపించసాగినయి.

వీరనారీనికేతన్ సభ్యులు చకచక పనిలోకి దిగిపోయారు. చుట్టు పక్కల ఆడాళ్ళనందరినీ హడావుడిగా పిల్చు కొచ్చేశారు. అందర్నీ ఉద్దేశించి సరస్వతి అప్పడప్పుడే అర్జంటుగా ప్రసంగిం చేసింది.

"సోదరీమణులారా ! మన ఆడ జాతి ఎంత దౌర్భాగ్యపు స్థితిలో ఉందో తెలుసుకోవాలంటే ఈ ఇల్లే ప్రత్యక్ష సాక్ష్యం. మగాడి నిరంకుశత్వానికి కూడా ఇదే ఇల్లు ప్రత్యక్ష సాక్ష్యం. అదిగో ! అతి దారుణంగా హింసింప బడుతోన్న మన తోటి ఆడదాని కేకలు ఏడుపులు ! చూస్తారేం ఇంక ! తలుపు తట్టండి-తీయకపోతే పగలకొట్టండి ? ఆడది మొగాడి కంటే తక్కువ కాదనీ- ఈ మగ పురుగుల రాక్షసత్వం ఇక చెల్లదనీ ఋజువుచేయండి..."

అందరూ తలుపులు కొట్టారు.



దబ్బున తెరచుకొన్నాయి తలుపులు. ఒక లావుపాటావిడ చేతిలో అప్పడాల కర్ర పట్టుకొని బయటి కొచ్చింది కోపంగా.

"ఎవరు మీరు? ఏం కావాలి?" అంది ముఖం చిట్లిస్తూ.

"వీరనారీనికేతన్ సభ్యులం. మీ ఆయన మిమ్మల్ని కొట్టటం చెవులారా విన్నాం! అతనికి బుద్ధి చెబుదామని వచ్చాము..."

ఆమె ముఖంలో కోపం మాయ మయ్యింది.

"ఒకసారి ఇటు లోపలి కొచ్చి చూడండి..." అంది పక్కకు తప్పు కొంటూ. అంతా ముందుకి నడిచి లోప లకు తొంగిచూశారు. ఒక బట్టతలతను స్తంభానికి కట్టబడి ఉన్నాడు. అతని వంటిమీద దెబ్బలు తేలిపోయినయి. "అతను-మా ఆయన-పిచ్చి వేషాలేస్తే నేనే అడపాదడపావాయించేస్తానాయన్ని -నన్ను ఆయన కొట్టడమేమిటి మీ తల కాయ్? ఫొండి నా మొగుడికి బుద్ధి చెప్పుకోలేనంతటి బలహీనురాలిని కాదు నేను..."

అనేసి భళ్ళున తలుపులు మూసేసు కొంది.

అంతా నిర్ఘాంతపోయారు.

"ఇలా కూడా జరుగుతుందన్న మాట..." అనుకొన్నారు.

"అదిగో-ఆ మూడో ఇంట్లో పెళ్ళి చూపులు జరుగుతున్నాయట-పదండి !"

ఆడపిల్లని బలిపశువులా వాడిముందు కూర్చో బెట్టటం-వాడేమో లక్ష ప్రశ్నలు వేసి-పాతిక గుంజీలు తీయించి-వీలైనన్ని శరీర భాగాలు కళ్ళతో టెస్ట్‌చేసి-చివరకు నచ్చ లేదనడం—ఇలాంటి అన్యాయాలు ఇకముందు జరగటానికి వీల్లేదు-ఆడది రబ్బరుబొమ్మ కాదు. చేసుకొన్న వాడినే చచ్చినట్లు ప్రేమించి కాపరం చేయడానికి-ఇకముందు ఆడదే కుర్రాడిని చూసి ప్రశ్నలడగాలి. నచ్చితే అప్పుడు పెళ్ళాడాలి..."

"అవునవును !'' అంటూ అరచా రందరూ.

బిలబిలమంటూ అంతా మూడో ఇంట్లో జొరబడిపోయారు. అక్కడ హాల్లో పెళ్ళిచూపులు జరుగుతున్నాయి. అయితే 'వీరనారీనికేతన్' సభ్యులు ఊహించినట్లు పెళ్ళికూతురు చాపమీద కూర్చుని తలవంచుకొన్న దృశ్యం కని పించలేదు. ఆవిడ సోఫాలో దర్జాగా కూర్చుంది. ఎదురుగ్గా మరో సోఫాలో పెళ్ళికొడుకు బోలెడు సిగ్గుతో దిక్కులు చూస్తున్నాడు పెళ్ళికూతురు మొఖంలోకి చూడలేక.

"డౌన్‌డౌన్ పెళ్ళికొడుకూ ! పెళ్ళి కొడుకుల నిరంకుశత్వం నశించాలి !-పెళ్ళి చూపులు మారాలి ! పెళ్ళికూతురు జిందాబాద్ !" అంటూ కేకలు వేశారు సభ్యులంతా.

పెళ్ళికొడుకు ఖంగారుపడి లేచి బయటకు వెళ్ళిపోయాడు వడివడిగా. లోపల్నుంచి పెళ్ళికూతురు తల్లికాబోలు 'రయ్' మంటూ వాళ్ళదగ్గరకు దూసు కొచ్చింది.

"ఎవరు మీరంతా ? ఏమిటా కారు కూతలు" అంటూ అరచింది కోపంగా.

"మేము 'వీరనారీనికేతన్' సభ్యులం. అనాదిగా పెళ్ళిచూపులు పేరుతో ఆడ జాతికి జరుగుతోన్న అన్యాయాన్ని ఎదిరించటానికి వచ్చాం ! మగాడు ఆడ దాని కంటే ఎందుకు ఎక్కువ ? పెళ్ళి చూపుల్లో ఆడదెందుకు తల వంచుక్కూ-చోవాలి ? ఆడపిల్ల ఇష్టాఇష్టాలెందుకు పాటించబడవు ? కోరిన భాగస్వామిని సెలక్ట్ చేసుకొనే ఆప్షన్ ఆడదాని కెందుకు లేదు?..." సరస్వతి వాగ్ధాటికి 'నోర్మూయ్' అంటూ అడ్డుపడింది పెళ్ళి కూతురు.

"ఏమిటి ?'' ఆశ్చర్యంగా అడిగింది సరస్వతి.

"నోర్మూయ్య మంటున్నాను. మీరను కొంటూన్న ఆడపిల్లను నేను కాదు.

ఇంతవరకూ పదకొండు మంది కుర్రాళ్ళు నన్ను చూసి చేసుకొంటామన్నారు. నాకు నచ్చలేదని నేనే తిరస్కరించాను, తెల్సిందా ?" అనేసి విసురుగా లోపలి కెళ్ళిపోయింది.

"అది ఏ కళనుందో-ఈసారన్నా-ఆ పెళ్ళికొడుకుతో చాలాసేపు మాట్లాడింది-ఈ సంబంధం కుదిరిపోతుందని అనుకొన్నాను-పాడుమూక మీరొచ్చి నా కూతురు పెళ్ళి కాస్తా చెడగొట్టారు-ఇంకా చూస్తారేం ? బయటకు పొండి !-ఇంకోసారి ఈ చుట్టుపక్కల కనిపించారంటే-మర్యాద దక్కదు-జాగ్రత్త."

ఆవిడ మాటలు వినలేక అంతా బయటి కొచ్చేశారు.

సరస్వతి ముఖం అవమానంతో ఎర్రగా కందిపోయింది.

"బ్లడీహెల్ ! మనచేత సంస్కరింపబడే ఆడదే లేదా ఈ ఊళ్ళో?..." అని మండిపడింది.

"లేకేం ? ఉంది—" అంది ఓ సభ్యురాలు.

"ఎవరు? ఎక్కడ? పదండి సంస్కరిద్దాం !'' అంది సరస్వతి.

"ఇక్కడే. ఈ వీధిచివర అవధాన్లు గారి రెండో అమ్మాయ్ ! ఆ అమ్మాయికి పెళ్ళయింది. పెళ్ళయిన నెల్రోజులకే భర్త గుండాగి పోయాడు. ఇప్పుడా అమ్మాయి విధవ. తల్లిదండ్రులు మూల కూర్చోబెట్టి మూఢ ఆచారాలతో హింసిస్తున్నారు. మనం ఆ అమ్మాయిని మళ్ళీ వివాహం చేసుకోమని ప్రోత్సహించాలి. ఆమె తల్లిదండ్రులకు నచ్చజెప్పాలి. మగాడయితే పెళ్ళాం చచ్చిన మర్నాడే మరో వివాహం చేసుకోడంలేదూ ?"

"అవును ! అవును ! పదండి !" అన్నారంతా.

అయిదు నిముషాల్లో అవధాన్లుగారిల్లు చేరుకొని, 'వీరనారీనికేతన్ జిందాబాద్' 'వర్థిల్లాలి' అంటూ కేకలువేశారు. ఆ కేకలు విని అవధాన్లుగారు ఖంగారుగా బయటికొచ్చారు.

"ఏమిటి ?" అనడిగారాయన ఎదురుగ్గా నిలబడ్డ సరస్వతి వంకచూస్తూ.

"నేను వీరనారీనికేతన్ ప్రెసిడెంట్ సరస్వతిని. ఆడాళ్ళకు జరిగే అన్యాయాలని ఎదుర్కోడానికి మా సంస్థ వెలిసింది..." అంది సరస్వతి.

"చాలా సంతోషం ! ఇక్కడ ప్రస్తుతం మీతో ఉద్ధరింపబడాల్సిన వారెవరూ లేరే ?" అన్నారాయన.

"లేకపోవడమేమిటి ? మీ ఇంట్లోనే మీ రెండో అమ్మాయ్ ఉంది—"

"మా రెండో అమ్మాయా ?" ఆశ్చర్యంగా అన్నారాయన.

"అవును ! ఆ అమ్మాయికి భర్త చనిపోయాడని తెల్సింది. వెంటనే ఆ అమ్మాయికి మరో వివాహం చేయాలి. ఆ అమ్మాయిని జీవచ్ఛవంలా వెలుగు

చూడకుండా ఇంట్లో హింసించడాన్ని మేము నిరసిస్తున్నాం..."

"నేను చెప్పేది కొంచెం..." ఏదో చెప్పబోయారు అవధాన్లుగారు, కాని సరస్వతి వినిపించుకోలేదు.

"మగాడు భార్య చనిపోతే వెంటనే పెళ్ళెందుకు చేసుకొంటున్నాడు? అదే పెళ్ళి ఆడదెందుకు చేసుకోకూడదు? భర్తపోయినంత మాత్రాన ఆడదాని యవ్వనం-కోరికలూ అన్నీ వృధా కావల్సిందేనా? వీల్లేదు! వీల్లేదు? వీల్లేదు...వీరనారీనికేతన్ జిందాబాద్! అవధాన్లుగారి రెండో అమ్మాయ్ మళ్ళీ పెళ్ళాడాలి..." అంటూ అరవసాగారు వాళ్ళంతా. అవధాన్లుగారు 'సైలెన్స్' అంటూ గట్టిగా అరచేసరికి అంతా నిశ్శబ్దమయిపోయారు. "నేనుచెప్పేది కొంచెం వినండి! భర్త చనిపోయిన మా రెండో అమ్మాయ్, వారం రోజుల క్రితం ఓ కుర్రాడితో లేచిపోయింది. ఎక్కడుందో అడ్రస్ కూడా తెలీదు. ఖచ్చితంగా ఆ కుర్రాడినే పెళ్ళాడాలీ అని మీరనుకొంటే పోలీస్ ద్వారా ఆచూకీ లాగి ఆమె దగ్గరకెళ్ళి ఆ వివాహమహోత్సవమేదో మీరే జరిపించండి—నాకూ, దానికీ ఎటువంటి సంబంధమూలేదు. ఇక వెళ్ళండి ..." అనేసి తలుపులు మూసుకొన్నారాయన. కిటికీలోనుంచి అవధాన్లుగారి భార్య గొంతు ఏడుపు మధ్య వినిపించింది "ఈ పాడు మూకే నా కూతురిని చెడగొట్టారు దేముడో—లేపోతే అంత గుణవంతురాలి కీపాడు బుద్ధి ఎలా పుడుతుంది రాముడో—"

"నాకు వళ్ళుమండిపోతోంది!" అంది సరస్వతి కోపంగా.

"అవును! మాకూ అంతే!'' అన్నారు మిగతా వాళ్ళు కూడా వళ్ళు మంట తెచ్చుకొని.

"ఈ ఊళ్ళో మన ఆడాళ్ళంతా చాలా ఎడ్వాన్స్ అయిపోయారు. వీళ్ళను మనం సంస్కరించాల్సిన అవసరమేమీ లేదు. ఏయే ప్రాంతాల్లో మన ఆడాళ్ళు వెనుకబడి ఉన్నారో ముందు తెలుసుకోవాలి'' అంది సరస్వతి.

"అవును! ముందుగా మనరాజధానితో ప్రారంభిస్తే బావుంటుంది...'' అందో సభ్యురాలు. చాలా మంది వప్పేసుకొన్నారు.

అప్పటికప్పుడే చందాలు పోగు చేసుకొని టూరిస్ట్ బస్‌లో హైద్రాబాద్ చేరుకొన్నారు. హైద్రాబాద్ బ్రాంచి వీరనారీనికేతన్ సభురాంద్రు వాళ్ళకు పెద్ద ఎత్తున స్వాగతమిచ్చారు. సరస్వతి అంతకు ముందెప్పుడూ వాళ్ళూరు టెంకాయపాలెంవదలి బయటకు పోలేదు. హైద్రాబాద్ సిటీ చూసేసరికి ఆమెకు కళ్ళు తిరిగినట్లనిపించింది.

మిగతా సభ్యురాంద్ర పరిస్థితి కూడా అలాగే ఉంది.

ఎక్కడ చూసినా ఆడాళ్లే—



సినిమా హాల్స్‌లో, సిటీ బస్సుల్లో, మార్కెట్లలో, టాక్సీల్లో, సైకిళ్ళమీద-స్కూటర్లమీదా, హోటల్స్‌లోపలా-ఆఫీసుల్లో ఎటు చూసినా వాళ్ళే-ఎక్కడ చూసినా వాళ్ళే—

రవీంద్రభారతిలో 'వీరనారీనికేతన్' సభలు బ్రహ్మాండంగా జరిగినాయి. చాలా తక్కువమంది-సభలకు హాజరవడం—ఖచ్చితంగా పదహారుమంది-ఆశాభంగం కలిగించినా ఫరవాలేదని సరిపెట్టుకొంది సరస్వతి. మర్నాడు ఇళ్ళవెంబడి తిరిగి తమ సిద్ధాంతాలు ప్రచారం చేయాలని సభ ఏకగ్రీవంగా నిర్ణయించింది.

మర్నాడుదయమే కాలనీల్లోకి బయల్దేరారు. చాలా చోట్ల ఇళ్ళల్లో ఆడాళ్ళు లేరు. ఉద్యోగాలకో, సినిమాలకో, బజారుకో వెళ్ళిపోయారు. ఓ ఇల్లు తలుపు కొట్టగానే ఒకావిడ బయట కొచ్చి 'ఏం కావాలి' అంది ఆశ్చర్యంగా.

"మేము వీరనారీనికేతన్ సభ్యులం!" అంది సరస్వతి.

లోపల్నుంచి ఓ యువకుడు రెండు ఫైళ్ళు పట్టుకొని బయటి కొచ్చాడు. అతన్ని చూడగానే సరస్వతి స్పీచ్ మొదలుబెట్టేసింది.

"అనాదిగా మన ఆడజాతికి జరుగుతోన్న అన్యాయాన్ని ఎదిరించాలి. ఆడది కూడా మగాడితో..."

"ఇంతకూ ఇప్పుడేమంటారు?" విసుగ్గా అడిగిందామె.

మీ భర్తకూడా వంటచేయాలి. ఇంట్లో పని చేయాలి-పిల్లల్ని ఎత్తుకుని తిప్పాలి. —బట్టలుతకాలి...''

"కొంచెం ఆగండి..." గట్టిగా అందావిడ.

"ఎందుకూ ?"

"నాకింకా పెళ్ళి కాలేదు..."

"ఆ !..." ఆశ్చర్యపోయారందరూ.

ముప్పై అయిదేళ్ళ వయసున్న ఈమెకు ఇంకా పెళ్ళిగాలేదా ?

''మరి...ఇతను..." ఆ యువకుడి వంక చూపుతూ అడిగింది సరస్వతి.

''అతను నా బాయ్‌ఫ్రెండ్...మా టైమ్ వేస్ట్‌చేయక ఇక వెళ్ళండి..." అంది కటువుగా.

రోడ్డుమీద కొచ్చేసరికి భార్యాభర్త లిద్దరూ పిల్లలతో వెళ్తూ కనిపించారు వాళ్ళను చుట్టుముట్టేశారందరూ.

"వీరనారీనికేతన్ జిందాబాద్..."

"మీరు చేసే పనులన్నీ మీ భర్త కప్పగించండి..."

"మీ చంకలో ఉన్న పాపని-ఆయన కివ్వండి...మీ పాపను మీరెందుకు మొయ్యాలి? తొమ్మిది నెలలు మోసింది చాలు..."

ఆమె భర్త గట్టిగా నవ్వాడు,

"పాపను నేను ఎత్తుకొన్నంత మాత్రాన మీ స్త్రీలు ముందు కొచ్చేసి నట్టేనా ?"

"ఇలాగే అన్నిటిలోనూ మగాళ్ళు బాధ్యత తీసుకోవాలి..." అందరూ అరచారు. అతను మళ్ళీ నవ్వి జేబులో నుంచి సిగరెట్ తీసి వెలిగించి భార్యకొక సిగరెట్ ఇచ్చాడు. ఆమె కూడా తన బాగ్‌లోనుంచి లైటర్ తీసి సిగరెట్ వెలిగించుకొంది.

సరస్వతి బృందం తెల్లబోయారు.

"సిగిరెట్లు...అవ్వ..."

అక్కడనుంచి మౌనంగా నడిచారు వాళ్ళు. ఎదురుగ్గా ఉన్న బార్‌లోనుంచి ఒక స్త్రీ తూలుతూ బయటి కొచ్చింది. ఇద్దరు మొగాళ్ళు ఆమెను పడిపోకుండా పట్టుకొని కార్లో కూర్చుండబెట్టారు. సరస్వతి బృందాన్ని చూడగానే నిషాగా నవ్వి 'మైనషేమేహు' అంది.

సభ్యులంతా బెదిరిపోయారు.

"ఏమిటీ ఊళ్ళో ఆడాళ్ళిలా తెగించేశారు ?'' అనుకొన్నారు లోపాయికారీగా. ఓ టాక్సీ వాళ్ళపక్కగా ఆగింది అందులోనుంచి ఓ యువతి దిగి లోపలే కూర్చున్న యువకుడితో "రేపు మధ్యాహ్నం పన్నెండు తరువాత రా ! మా ఆయన కాంప్ కెళ్ళిపోతున్నారు-పదకొండు గంటలకు !" అంది.

ఆ మర్నాడే సరస్వతి బృందం వాళ్ళూరు తిరిగొచ్చేశారు

వచ్చిన రెణ్ణెల్లవరకూ ఏం చేయాలో తోచలేదు సరస్వతికి. ఈలోగా తమ

వీరనారీనికేతన్ సెక్రటరీ సుధారాణి వివాహం నిశ్చయమైందన్న వార్త అంతా కార్చిచ్చులాగా పాకిపోయింది

వెంటనే సభ్యురాండ్రంతా అర్జంటుగా సుధారాణి ఇంటికి పరుగెత్తారు.

"ఏమిటి పెళ్ళిట ? పెళ్ళికొడుకెవరు? మన నిబంధనలన్నిటికీ వప్పుకొన్నాడా?" అనడిగారు ఆత్రుతగా.

"వప్పుకోలేదు..." అంది సుధారాణి

"ఎందుకని ?..."

"నేను మీ నిబంధనలు పెట్టలేదు."

"అదేమిటి ? మన సంస్థలో ఉన్న వాళ్ళందరం ప్రతిజ్ఞ చేశాం కదా ..."

"మన సంస్థకి రిజయిన్ చేస్తున్నాను. ఇదిగో రాజీనామా లెటర్..." అంది సుధారాణి ఉత్తరం విసిరేస్తూ.

"కారణం ఏమిటి ?"

"ఏముంది ? కేవలం పర్సనల్। ఇంతలో మన నియమావళికి అంగీకరించే వాళ్ళెవ్వరూ దొరికేట్లు కనిపించలేదు. ఇటు చూస్తే నా వయసు పెరిగిపోతోంది మా బావే వచ్చి నన్ను పెళ్ళాడతావా అనడిగాడు. ఓకే అన్నాను. అతను డాక్టరు చదివాడు. మన నిబంధనలన్నీ వింటే 'గెటవుట్' అని మరో పిల్లని చేసుకొంటాడు. అది నాకిష్టం లేదు..."

సుధారాణి పెళ్ళి బ్రహ్మాండంగా జరిగిపోయింది.

అది జరిగిన కొద్దిరోజుల్లోనే చాలా మంది సభ్యురాండ్ర వివాహాలు కూడా అయిపోయినయి. అందరూ 'నియమావళి' ఉల్లంఘించినట్లు సరస్వతికి రిపోర్టు వచ్చింది వెంటనే వాళ్ళందరికీ 'సభ్యత్వం' రద్దుచేసి పారేసింది సరస్వతి. చివరకు సరస్వతి ఒక్కత్తే ఒంటరిగా మిగిలిపోయింది. ఆమె చెల్లెళ్ళకు తమ్ముళ్ళకూ కూడా వివాహాలయిపోయినాయి తల్లిదండ్రుల బలవంతం-చెల్లెళ్ళు, తమ్ముళ్ళ గొడవ భరించలేక ఆఖరికి ఓ రోజు నియమా లేమి లేకుండానే పెళ్ళికి వప్పుకొందామె. వప్పుకొన్న వారంరోజులకే హనుమంతరావుతో పెళ్ళయిపోయింది. మొదటి రాత్రే ఇద్దరికీ పేచీకూడా వచ్చేసింది. రావడానికి సరస్వతి చాలా సహాయపడింది.

"నువ్ చాలా అందంగా ఉన్నావు సరస్వతీ," అన్నాడు హనుమంతరావ్ సరస్వతిని దగ్గరకు లాక్కొంటూ.

"ఈ డైలాగు ఇప్పటి కెంతమంది ఆడాళ్ళదగ్గర వాడావ్ ?" అంది సరస్వతి విదిలించుకొంటూ.

హనుమంతరావుకి తిక్క పుట్టుకొచ్చింది. పెళ్ళిపీటలమీద పెళ్ళికూతురికే మంగళసూత్రం ఎందుకట్టాలీ, పెళ్ళికొడుక్కెందుకు కట్టకూడదూ అంటూ ఆమె పేచీ పెట్టటం అతనికి గుర్తుకొచ్చింది.

"నీ కెంతమంది మగాళ్ళు చెప్పారీ సంగతి," అన్నాడతను.

"ఛీ! ఆడదానికి నీతి ఉంది. లేందల్లా మీ మగవెధవలకే!" అంది సరస్వతి రెచ్చిపోతూ!

"నీ కెలా తెలుసీ సంగతి? ఏ మగ వెధవయినా మోసంచేశాడా?" అన్నాడతను హేళనగా.

"నన్నా! చెప్పతీసు క్కొడతాను వాడిని! అందరిలాంటి ఆడదాన్ననుకొంటున్నావేమో!" అంది రోషంగా.

"ఏక వచనంతో సంభోదిస్తున్నావే—మర్యాద తెలీదా?" ఉడికిపోతూ అడిగాడతను.

"నన్ను ఏకవచనంతో పిలవటం లేదూ, నువ్వు?"

"నువ్వు నా పెళ్ళానివి. నా కా హక్కుంది..."

"నాకూ ఉందాహక్కు..."

"ఏడిశావ్!"

"నువ్వే ఏడిశావ్..."

ఆ తరువాత తన భావాల్ని మాటల్లో చెప్పటం కుదర్లేదతనికి. ఆమె చెంపలు ఛెళ్ళుమనిపించి చేతల్లోకి దిగాడు

'ఆడది మొగాడితో సమానం' అన్న సిద్ధాంతం ప్రగాఢంగా నమ్మిన సరస్వతి తిరగబడి అతని చెంపమీద కొట్ట బోయింది గాని హనుమంతరావ్ ఆమె చేతిని తప్పించుకొని గొడ్డుని బాదినట్లు బాదేశాడు. మూడు రోజుల వరకూ ఆమె వళ్ళంతా నొప్పులు పోలేదు. ఆ తరువాత మాటా మంతీ లేకుండానే ఇద్దరూ నెల్రో జులు కాపరం చేశారు. ఈ నెల్రోజుల్లోనూ ఓ సారి వంట చేయనందుకూ, మరో సారి మగజాతిని అతనెదుర్గా తిట్టి పోసినందుకూ మరో రెండుసార్లు ఆమెని చావగొట్టాడతను.

అప్పుడు సరస్వతి కోవిషయం తెలిసింది.

మగాడు ఆడదానికంటె బలవంతుడు. కాబట్టి శారీరక బలం విషయంలో ఆడదీ మొగాడూ సమానమన్న తన సిద్ధాంతం తప్పయింది.

మరో రెండు నెలలకి సరస్వతి గర్భవతయింది.

అప్పుడు ఇంకో విషయం తెలిసొచ్చింది.

సృష్టే ఆడదాన్ని మగాడిమీద ఆధార పడేట్లు చేస్తోంది. ఈ పిల్లల్ని కనే బాదరబందీ లేకపోతే ఆడది మగాడిలా దర్జాగా ఉండేది.

ఆ తరువాత మరో విషయం

మగాడు చేసే కష్టమయిన పనులు కొన్ని ఆడది చేయలేదు.

ఇలా తెలుసుకొంటూండగానే ఆమెని పుట్టింటివారు తీసుకెళ్ళిపోయి పురుడు పోసి తిరిగి హనుమంతరావ్ దగ్గరకు పంపించారు. రైలు దిగి ఇంటికొచ్చేసరికి హనుమంతరావ్ మరో స్త్రీతో సొంత పెళ్ళాంలా కాపరం చేస్తూ కనిపించాడు.

సరస్వతి మండిపడుతూ 'ఇదెవరు?' అనడిగింది, ఆ యువతిని చూపిస్తూ.

"నువ్వెవతివే ?" అందా యువతి ఈసడింపుగా.

"నా యింటికొచ్చి నన్నే ఎవరని అడుగుతావా ?" అంది సరస్వతి ఉక్రోషంగా.

"నీ ఇల్లా ? సిగ్గులేదూ ఆ మాట అంటానికి ? నీ ఇల్లు, నీ మొగుడు అన్న అభిమానం, ప్రేమ నీకుంటే మీ ఆయన నా వెంబడెందుకు పడతాడు ?" అందామె.

"ఏమిటిదంతా ? మాట్లాడవేం ?" అంది సరస్వతి హనుమంతరావ్ వంక చూస్తూ, ఉద్రేకంగా.

"అది చెప్పేది నిజమే :—ఇంకో గంటలో నీకు తిరిగి మీ ఇంటికెళ్ళడానికి బండి ఉంది..." అన్నాడతను.

"నీలాంటి వెధవతో కాపరం చేయడం కన్న అదే నయం," అంటూ పుట్టింటికి చక్కా తిరిగొచ్చేసింది సరస్వతి.

వచ్చేసి హనుమంతరావ్‌ని కోర్టు కెక్కించి విడాకులు తీసుకొని అతని జీతంలో తనకూ భాగం సంపాదించు కొంది.

తన కొడుకు పెరిగి పెద్దాడయి మగ జాతిలో కలసిపోయి ఆడదాన్ని అణగ దొక్కేసాడన్న అసహ్యంతో వాడిని దూరం ఎక్కడో అనాథశరణాలయంలో చేర్పించేసింది. తరువాత తన స్నేహితు రాలి మొగుడు సహాయంతో ఓ చిన్న ఉద్యోగం సంపాదించుకొంది. సంపా దించుకొని పత్రికల్లో మగజాతిని

దుయ్యపడుతూ వ్యాసాలురాసింది. చాలా మంది పాఠకులు ఆ వ్యాసాలు చదివి అద్భుతం అన్నారు. అన్నారు కదాని మరింత దుమెత్తిపోస్తూ వారపత్రికల్లో సీరియల్స్ రాసింది ఆవి చదివి ఆడాళ్ళు కొంతమంది 'అమోఘం' అన్నారు. మగాళ్ళు చాలామంది నవ్వారు. కొంత మంది నవ్వుకొన్నారు.

దాంతో సరస్వతికి తానో సంఘ సంస్కర్తనేమో అన్న అనుమానం వచ్చింది ఇద్దరు ముగ్గురు స్నేహితు రాండ్ర నడిగితే "నీ మొహం! ఇంకా అ ను మా న మే మి టి ?" అంటూ కోప్పడ్డారు.

ఆ ప్రోత్సాహంతో ఆవిడ మరింత విజృంభించేసింది. 'అలనాటి నుంచీ ఆడదానికి జరుగతున్న అన్యాయాలు' అనే గ్రంథం రచించేసింది. దాంట్లో ఆది శక్తి దగ్గర్నుంచీ, పక్కింటి సుబ్బారావ్ రెండో పెళ్ళాం భానుమతి వరకూ అందరి గురించీ, వాళ్ళకు జరిగిన అన్యాయాల గురించీ వెయ్యి పేజీ ల్రాసింది.

ఆ గ్రంథాన్ని కొన్ని ఆడపిల్లల కాలేజీలు టెక్స్ట్ బుక్‌గా నిర్ణయించినయి. దాంతో సరస్వతి విలువ పెరిగిపోయింది. పబ్లిషర్లు ఆమె ఇంటిచుట్టూ తిరగ సాగారు. అందులో ఓ యువక పబ్లిషర్ 'నిన్ను పెళ్ళాడతా' నన్నాడు, కాని ఆమె షరతులు విని గంటకు రెండు వందల మైళ్ళ వేగంతో పరుగెత్తు కొంటూ వెళ్ళిపోయాడు. 'ఇంతోటి భార ద్దేశంలో నాకు నచ్చే వరుడే దొరకడా' అని మండిపడింది సరస్వతి. ఆ మర్నాడే పేపర్లో 'వరుడు కావలెను' అన్న ప్రకటన కనిపించింది.

వరుడు 'ఆడది మగాడి కంటే తక్కువ' అన్న చులకన భావం లేని వాడు, పెళ్ళానికి అమితమైన గౌరవం ఇవ్వగల వాడు, 'మగాడు వంట చేయటం -ఆడది ఉద్యోగం చేయటం' తప్పు అననివాడూ, భార్య పరాయి మగాడితో మాట్లాడినా, తిరిగినా తప్పుపట్టని వాడూ, భార్యని పల్లెత్తుమాట అనని వాడూ. కనీసం డిగ్రీ వరకయినా చదివినవాడూ, ఇంతకు ముందొక సారి పెళ్ళాడనివాడూ, ఏ బాదరబందీ లేనివాడూ అయుండాలని ఆ ప్రకటనలో ఉంది.

ఆ ప్రకటన పడిన తర్వాత వారం రోజుల వరకూ ఆ పేపర్ సర్కు లేషన్ సగానికి సగం పడిపోయింది.

షుమారు పదిహేన్రోజుల తర్వాత ఓ యువకుడొచ్చి ఆమె ఇంటితలుపు తట్టాడు. తలుపు తీసి "ఏమిటి ? ఏం కావాలి ?" అంది సరస్వతి.

"నా పేరు బసవలింగం..." అన్నా డతను.

"నీ పేరు నా కనవసరం—ఏం కావాలి ?"

"వరుడు కావాలని...ఈ ఇంటి అడ్రస్ నుంచి పేపర్లో ప్రకటన..."

"ఓహ్హో..." అంది సరస్వతి అర్థమయినట్లు.

"వరుడెవరు?" అనడిగింది వెంటనే.

"నేనే..."

"ఓహ్హో...నువ్వా...రా! కూర్చో!" అంది లోపలకు దారితీస్తూ.

బసవలింగం ఆమె వెంబడే లోపలకు నడిచి బెరుగ్గా కుర్చీలో కూర్చున్నాడు. సరస్వతి టేబుల్ మీద కూర్చుని అతన్ని పరీక్షగా పరీక్షించింది. అతను ఓ సారి ఆమె ముఖంలోకి చూచి భయపడి వెంటనే తలదించేసుకొన్నాడు.

"ఏం చదివావ్?" అడిగింది సరస్వతి.

"బి. ఎ. ఫెయిలయ్యానండి..."

"ఎందుకని?"

"ఏమోనండీ..."

"వంట చెయ్యగలవా?"

"బాగా వచ్చండీ!"

"ప్రకటనలోని అన్ని విషయాలకూ నువ్వు అంగీకరిస్తున్నావా."

"పూర్తిగా అంగీకరిస్తున్నానండీ!"

"సరస్వతిని నేనే - నేన్నీకు నచ్చానా?"

"భలేవారండీ! నచ్చకపోడం ఏమిటీ?"

సరస్వతికి అతన్ని చూస్తూంటే బోలెడు ముచ్చటేసు కొచ్చింది తను అతన్ని ఏకవచనంలో పిలుస్తున్నా అతను తనని బహువచనంతో సంబోధిస్తున్నాడు. ఎంతో గౌరవంగా మాట్లాడుతున్నాడు. పైగా చచ్చేంత అమాయకుడిలా కనిపిస్తున్నాడు. ఇతన్ని చేసుకొంటే తన జీవితం ధన్యమయిపోతుంది. మగాడే ఆడదానికి బానిస అని అందరికీ చాటించవచ్చు. రచనల్లోనే కాదు. నిజ జీవితంలో కూడా తను మగాడిని అణగదొక్కగలదని, నిరూపించవచ్చు. తన క్కావలసిందల్లా సరిగ్గా ఇలాంటి భర్తే

మరి కొన్ని ప్రశ్నలు వేసి "సరే రేపు ఉదయం రా! అగ్రిమెంట్ రాసుకొందాం!" అందామె.

తరువాత కొద్ది రోజుల్లోనే అనేక మంది ప్రముఖుల సమక్షంలో ఇద్దరికీ బ్రహ్మాండంగా శాస్త్రయుక్తంగా వివాహం అయింది. అయితే తన మెడలో తాళి కట్టించుకోడానికి సరస్వతి ఇష్టపడలేదు.

పెళ్ళయిన మొదటి రోజునే అతనికి పనులు పురమాయించింది సరస్వతి. "చూడు" రేపట్నుంచీ నువ్వు తెల్లారుజామునే లేవాలి. ఇల్లు ఊడ్చి, నాకు వేడినీళ్ళు సిద్ధం చేసి నన్ను లేపాలి. నేను స్నానం ముగించి సిద్ధమయేలోగా వంట పని ముగించాలి అప్పుడు ఇద్దరం కలిసి భోజనం చేద్దాం! తరువాత నేను ఆఫీసు కెళ్ళిపోతాను.

నువ్వు ఇంట్లో రెస్ట్ తీసుకో! తిరిగి సాయంత్రం నేను ఇంటికొచ్చే సరికి వంట పని ముగించుకొని సిద్ధంగా ఉండాలి. నాకు గడపలోనే చిరునవ్వుతో టీ అందించాలి. అప్పుడు ఇద్దరం, షికారుకో, సినిమాకో వెళ్ళవచ్చు... తెల్సిందా?'' అనడిగింది.

"ఓ!" అన్నాడు బసవలింగం సంతోషంగా.

ఆ రోజుకి అతనే వంట చేశాడు. ఇద్దరికీ మంచాలు వెన్నెల్లో వేసి, దుప్పట్లు పరచాడు. ఇద్దరూ భోజనాలు ముగించారు. సరస్వతి ముందస్తుగా వెళ్ళి తన మంచంమీద పడుకొంది. ఆమెకు అమితానందంగా ఉంది, అలాంటి భర్త దొరకడం! కాసేపటికి వంటిల్లంతా సర్ది, ఓ గ్లాసునిండా పాలు తీసుకొని అణకువగా ఆమెదగ్గరకొచ్చాడు బసవ లింగం!

"పాలు తాగండి!" అన్నాడు ఆమె పక్కనే మంచం మీద కూర్చుంటూ.

సరస్వతి లేచి కూర్చొని పాలు తాగింది. ఖాళీ గ్లాసు అందుకొని కింద పెట్టాడు బసవలింగం.

అతని నడుం చుట్టూ చేయి వేస్తూ, 'బసవలింగం' అంది సరస్వతి ప్రేమగా!

"నీ లాంటి భర్త దొరకడం నిజంగా నా అదృష్టం!" అంది అతన్ని గుండెల మీదకు లాక్కొంటూ.

''అంత మాటనకండి! ఆ అదృష్ట మంతా నాది. మీలాంటి ఉత్తమురాలు భార్యగా దొరకటం, నిజంగా నాఅదృష్టం అన్నాడు బసవలింగం ఉద్రేకంగా ఆమెని తనకేసి హత్తుకొంటూ.

ఇలాంటి సుఖానికి దూరమయి చాలా కాలమయింది సరస్వతికి. అంచేత అమితోద్రేకంతో అతన్ని పెనవేసుకు పోయింది. కొద్దిక్షణాలయినా అలా గడ వక ముందే ''ఇంక నాకు నిద్రొస్తోంది, నిద్రపోతాను..." అన్నాడు బసవలింగం ఆమె కౌగిలి విడిపించుకోడానికి ప్రయత్నిస్తూ.

సరస్వతి షాక్ తిన్నట్లు అతని వంక చూసింది. ప్రణయం పరాకాష్టనందు కొనే సమయంలో ఉద్రేకం పొందాల్సింది ఇతనిలా వుంటాడేం అని ఆశ్చర్యంగా ఉందామెకు.

బహుశా, తను మరింత చొరవ తీసుకో వాలేమో! కొన్ని పుస్తకాల్లో చదివింది తను. భర్త కొంచెం ముఖమాటపడే మనిషయితే భార్యే ప్రణయకలాపాల్లో చొరవ తీసుకోవాలని. బసవలింగం అలాంటి స్వభావంగలవాడయి ఉంటాడు.

ఆ ఉద్దేశంతో అతన్ని మరింత గట్టిగా కౌగలించుకొని తనే ముద్దు పెట్టుకొంది సరస్వతి. అయినా బసవ లింగం చలించలేదు.

"నన్ను వదలండి! నిద్రొస్తోంది.." అన్నాడు ఇబ్బందిగా.

సరస్వతి శరీరమంతా కోరికతో వేడెక్కిపోయింది. ఆలాంటి స్థితిలో అతని మాటలు విపరీతమయిన కోపం తెప్పించినయి. అయినా అది పైకి కన బడనీయకుండా "ఎందుకని ? అప్పుడే అలసిపోయావా ?" అంది చిరునవ్వుతో.

"అది కాదండీ ! ఎందుకనో నా కి లాంటివి ఇష్టముండదు !" అన్నాడతను.

"అదేమిటి ?" ఆశ్చర్యపోతూ అడి గింది సరస్వతి.

అవునండీ! చిన్నప్పటినుంచీ అంతే -వీటిమీద ఏ మాత్రం ఆసక్తి ఉండదు ..." అన్నాడు సిగ్గుపడుతూ

"మరి డాక్టరుని చూసి సంప్రదించ లేదూ ?"

"పెళ్ళయింది ఇవాళే కదండీ !"

నిర్ఘాంతపోయిం దామె.

ఏమిటీ మనిషి ? ఇలాంటి వాళ్ళు కూడా ఉంటారా ఈ లోకంలో ? ఆడ దానిమీద కోరిక లేకపోడానికి కారణం ఏమిటి ? బహుశా మానసికంగా ఏమ యినా వైద్యం కావాలేమో ! మర్నాడే డాక్టరుని సంప్రదించా లనుకొంది సరస్వతి.

డాక్టరు అంతా విని బసవలింగాన్ని పరీక్షించాడు. పరీక్షించి "ఇతను సంసారసుఖానికి పనికిరాడు" అన్న సర్టి ఫికెట్ ఇచ్చాడు

అది విని సరస్వతి మండిపడింది.

"రాస్కెల్ ! ఈ సంగతి ముందే ఎందుకు చెప్పలేదు ?" అంటూ బసవ లింగంమీద విరుచుకుపడింది.

"మీరడగలేదు కదండీ !" అన్నాడు బసవలింగం తాపీగా.

"వెంటనే బయటికి పో—మరోసారి నీ ముఖం నాకు చూపించకు..." అందామె కోపంగా

"ఎక్కడికి పోనండీ ? నాకు మీరు తప్పితే ఇంకెవరున్నారండీ?" అన్నాడు తను.

"పోతావా-పోలీస్‌ని పిలిచి గెంటించ మన్నావా ?" అందామె రుద్రకాళి అవ తారం దాలుస్తూ.

పోలీసులేంచేస్తారండీ!అయిదేళ్ళకుఇద్దరం అగ్రిమెంట్ రాసుకొన్నాంగదండీ!—"

"కాని ఇది మోసం కిందకు వస్తుంది ! నిన్ను అరెస్ట్ చేయవచ్చు !"

"మోస మెలా అవుతుందండీ! మీ ప్రకటనలో శారీరిక సుఖం గురించి మీరు ప్రస్తావించనేలేదు..."

నిర్విణ్ణురాలయి పోయింది సరస్వతి.

ఒకటి రెండు రోజులు కాదు-ఈ అవతారాన్ని అయిదేళ్ళు భరించాలి.

"ఈ పాడు మగజాతి..." అంటూ తిట్టబోయి నాలి క్కొరుక్కుం దామె.

ఆ తరువాత ఆమె కలంనుంచి మగవాళ్ళను దుమ్మెత్తి పోసే కథలూ, నవలలూ, నాటికలూ మరింతగా ఎక్కువయిపోయినయి.